క్లుప్తంగా

జిప్సంతో అధిక దిగుబడులు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు: జిప్సంతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో శుక్రవారం వేరుశనగ పంట సాగుపై రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ పంటలో 35 నుంచి 40 రోజుల తర్వాత 50 శాతానికిపైగా పూత దశలో ఉన్నప్పుడు ఎకరానికి 200 కేజీల జిప్సం చల్లుకోవాలని సూచించారు. దీని వల్ల గింజల్లో నాణ్యత పెరిగి మంచి దిగుబడి సాధించడమే కాకుండా ఆకుమచ్చ తెగులు నుంచి పంటను రక్షించవచ్చునని తెలిపారు.వేరుశనగకు కంచె పంటగా జొన్న లేదా సజ్జలను సాగు చేయడం వల్ల రసం పీల్చే పురుగు నుంచి పంటను కాపాడుకోవచ్చని వివరించారు. పొగాకు లద్దె పురుగు, శనగపచ్చ పురుగు ఉధృతి గుర్తించేందుకు ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యాన సహాయకులు వెంకటేష్‌నాయక్ రైతులు కర్రెన్న, రాము, వీరేష్, నరసన్న తదితరులు ఉన్నారు.

మాదిగల సంగ్రామ పాదయాత్ర



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని రూరల్: మాదిగల సంగ్రామ పాదయాత్ర నాలుగో రోజు శుక్రవారం ఆదోని పట్టణం నుంచి ప్రారంభించి బనవాసి వరకు చేపట్టారు. పాదయాత్రలో మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ సుభాష్‌చంద్ర, కో-కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. వర్గీకరణకు కట్టుబడి ఉండాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించిన పార్టీలకే వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు. హక్కుల కోసం ఐక్యంగా పోరాడతామని చెప్పారు. ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఆశపోగు పరమేశ్వర, కో-కన్వీనర్ రవి, ఎం.జగన్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా నాయకులు హనుమంతు, వీరన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు



మాట్లాడుతున్న ఎంఈఓ శివరాములు

ఆదోని అర్బన్: దివ్యాంగ పిల్లలకు ఉచితంగా సహాయ పరికరాలు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంఈఓ శివరాములు, సహిత విద్య కో-ఆర్డినేటర్ విజయ ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆదోని డివిజన్‌లో గల దివ్యాంగులు, భవిత కేంద్రాల్లోని 3-18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచితంగా సహాయ పరికరాలు అందజేసేందుకు స్థానిక సి.మల్లికార్జున విద్యాలయంలో సోమవారం నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగ చిన్నారులు హాజరై వైకల్య నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలన్నారు. శిబిరానికి సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, మూడు ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 98494 90413 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీ విజయంపై హర్షం

ఆదోని అర్బన్: మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ జయకేతనం ఎగురవేసిన సందర్భంగా శుక్రవారం ఆదోనిలోని మహావీర్ కూడలి వద్ద ఆదోని బీజేపీ శాఖ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు మహాదేవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ అన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్ర, నగర ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, ఉరుకుందగౌడ్, ఓబీసీ నగర అధ్యక్షుడు బాలాజీ, మండలాధ్యక్షుడు ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామ శివారులో ఉన్న తుంగభద్ర నది నుంచి శుక్రవారం ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొమ్మశెట్టి నాగేష్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించినట్లు మాధవరం పోలీసులు తెలిపారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

బాసటగా 'భరోసా'

- నియోజవర్గంలో 42,111 మందికి పెట్టుబడి సాయం
- రూ.8.52 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఆనందంలో రైతన్నలు



మంత్రాలయం: వ్యవసాయం దండగా అన్న నేతల నోళ్లు మూతబడుతున్నాయి. పండగలా వ్యవసాయం సాగాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలు రైతుల ఇంట వెలుగులు నింపుతున్నాయి. అలసిన రైతులకు పెట్టుబడిసాయం బాసటగా నిలుస్తోంది. రెండు కారుల ఆరంభంలోనే రైతుల చేతికి సాయం అందజేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే సాయాన్ని పది వేలుగా భావించి రైతన్నలు ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఏటా మూడు విడతల్లో రైతు భరోసా నిధులు రైతులకు అందజేస్తున్నారు. రబీ సీజన్‌లో భాగంగా మూడవ విడత కింద 42,111 మంది రైతులకు పెట్టుబడి సాయం మంజూరు చేశారు. నేరుగా రైతుల ఖాతాల్లో జమజేసి రబీ రైతులకు ఉపశమనం కల్పించారు. మంత్రాలయం నియోజకవర్గంలో 1.94 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. సన్న, చిన్న కారు రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. 42,111 మంది రైతులకు ఆర్థికం సాయం మంజూరవుతోంది. మూడవ సాయంగా పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.2,000 చొప్పున మంజూరు కావడంతో నియోజకవర్గానికి రూ.8.52 కోట్లు రైతుల ఖాతాల్లో జమకాబడ్డాయి. సరైన సమయంలో పెట్టుబడి సాయం మంజూరు కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగు అవసరాలకు ఆసరాగా నిలుస్తాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

కౌలు రైతులకు అండ

రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు అండగా నిలిచింది.

మంజూరైన వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయం వివరాలు

మండలం	రైతులు	పెట్టుబడిసాయం (రూ)
కోసిగి	9,309	1,86,29,500
పెద్దకడబూరు	9,530	1,93,82,000
మంత్రాలయం	8,462	1,72,23,000
కౌతాళం	14,810	3,00,22,500
మొత్తం	42,111	8,52,57,000

కేంద్ర ప్రభుత్వం కేవలం యాజమాన్య రైతులకు మాత్రమే పీఎం కిసాన్ నిధులు మంజూరు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు సైతం పెట్టుబడి నిధులు రూ.13,500 చొప్పున మంజూరు చేస్తుంది. మంత్రాలయం నియోజకవర్గంలో 415 మంది కౌలు రైతులకు రూ. 18,65,000 నిధులు విడదల చేసింది. కౌలు రైతులకు సాయం అందుతుడడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలాల వారీగా మంత్రాలయం 120 మంది, కౌతాళం 183, పెద్దకడబూరు 91, కోసిగి 21 మంది కౌలురైతులకు పెట్టుబడి సాయం అందింది.

పెట్టుబడులకు ఆసరా



నాపేరుపై రెండు ఎకరాల పొలం ఉంది. ఇప్పటివరకు నాకు మూడు విడతల్లో రైతు భరోసా నిధులు వచ్చాయి. నాలుగేళ్లుగా దాదాపు రూ.47,000లతో పాటు నిన్నటి రోజున రూ.2,000 నగదు ఖాతాలో జమ అయ్యింది. ఇలాంటి సాయంతో రైతులకు ఎన్నో అవసరాలు తీరుతున్నాయి. పెట్టుబడులకు దిగులు లేకుండా ఉంది.

– ఎం.రాఘవేంద్రరెడ్డి, బాపురం, కౌతాళం మండలం

సంతోషంగా ఉంది



రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కావడం అదృష్టం. రైతులను గురించి ఏ పాలకుడు పట్టించుకునేవాడు కాదు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత వానలు సకాలంలో కురుస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధర లభిస్తోంది. సరైన సమయంలో పెట్టుబడి సాయం అందుతోంది. ఇలాంటి సీఎం మరింత కాలం పాలిస్తే రైతుల బతుకులు మారతాయి.

– అల్లయ్య, రైతు, కోసిగి

ఘనంగా జల్లినాగన్న ఉరుసు

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ గ్రామంలో వెలిసిన శ్రీ జల్లినాగన్న తాత ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్గాకు చేరుకుని పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం యువ నాయకుడు జయమనోజ్ రెడ్డి వేడుకల్లో పాల్గొని దర్గాలో ప్రత్యేక ఫాతేహాల్ నిర్వహించారు. అంతకముందు జయమనోజ్ రెడ్డిని దర్గా నిర్వాహకులు, నాయకు లు గజమాలతో సన్మానించి ఆహ్వానం పలికారు. శనివారం జియారత్ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు చెప్పారు.

ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలి

ఆదోని రూరల్: పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని, విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలు రద్దు చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు, తాలూకా అధ్యక్షుడు మరియాని చెన్నబసప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు అధ్యక్షతన హోటల్ బీమాస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి పేద, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అలాగే 15వ తేదీలోపు బిల్లులు చెల్లించని వారికి సర్ చార్జీలు వేస్తున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే ఓటుతో బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు పి.సాయిబాబా, డివిజన్ గౌరవ సలహాదారులు ఢణాపురం శేషన్న, తాలూకా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.షేక్షావలి, పట్టణ అధ్యక్షులు డా.వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న పీడీ ఖలీల్ అహ్మద్, హనుమేష్

కోసిగి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని, విద్యార్థులు క్రీడలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, పీఈటీ అసోషియేషన్ ఆదోని జోన్ అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి నరసింహా రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారి పీడీ ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో వ్యాపారి హనుమేష్ సహకారంతో ఆదోని జోన్ అంతర పాఠశాలల బాలికల ఖోఖో పోటీలు నిర్వహించారు. ఆదోని డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో విజేతగా జెడ్పీహెచ్ఎస్-ఢణాపురం, ద్వితీయ స్థానం కందుకూరు, తృతీయ స్థానం బదినేహాల్ కన్నడ స్కూల్, నాలుగో స్థానం కోసిగి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. వీరికి హనుమేష్ షీల్డు కప్‌లతో పాటు మెడల్స్ బహుమతిగా అందజేశారు. నేడు బాలుర ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడకారులు ఉదయం 9 గంటల్లోగా పాఠశాల గ్రౌండ్‌కు చేరుకోవాలని సూచించారు. క్రీడకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు రాజారాం, పీఈటీలు శ్రీరామ, చెన్నబసవ, గంగాధర, పెద్దమాబాషా, వెంకటేశ్వర్లు, రామచంద్ర, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలు, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కోసిగి: దాడి కేసులో జంపాపురం గ్రామానికి చెందిన కురువ చంద్ర,కురువ నాగరాజుకు 9 నెలల జైలు శిక్ష,మరో వ్యక్తి కురువ తమ్మన్న అలియాస్ చిన్నబసప్పకు రూ.10వేలు జరిమానా విధిస్తూ ఆదోనిజ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చినట్లు కోసిగి పోలీసులు తెలిపారు.2020 సంత్సరంలో జంపాపురం గ్రామానికి చెందిన కురువ భీరలింగయ్య,కుటుంబసభ్యులపై పొలం విషయంలో చంద్ర,నాగరాజు, చిన్నబసప్ప దాడి చేసి గాయపరిచినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసున మోదైంది.ఈ కేసు శుక్రవారం ఆదోని కోర్టులో తుది విచారణకు రాగా నేరంరుజువు కావడంతో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించారు.

గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి

ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 పెంచడం దారుణమన్నారు. పెంచిన గ్యాస్ ధరతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ దిలీప్, ప్రధాన కార్యదర్శి సాయినాథ్, ఐఎన్‌టీసీ ప్రసిడెంట్ ఇర్ఫాన్, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ సేవలు భేష్



గుంటూరుకు వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అల్లయ్య

కౌతాళం: మండల కేంద్రానికి చెందిన వలంటీర్ అల్లయ్య గుంటూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసి ప్రశంసలు పొందారు. గ్రామానికి చెందిన పింఛను లబ్ధిదారులు నరసమ్మ, మూకమ్మ, బొంబాయి నరసమ్మ, బోయ నర్సమ్మ గుంటూరు కూలీ పనుల నిమిత్తం గుంటూరుకు వెళ్లడంతో వారి అడ్రస్ తీసుకుని అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము రూ.2750 చొప్పున పంపిణీ చేశాడు. వలంటీర్ వ్యవస్థ ద్వారా తాము ఎక్కడున్నా ప్రతి నెలా పింఛన్ అందుతోందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



క్రీడాకారిణులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఖోఖో పోటీల్లో ప్రతిభ

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ జెడ్పీ పాఠశాల విద్యార్థినులు ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు గౌరిశంకర్, వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహరాజు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం క్రీడాకారిణులను ఉపాధ్యాయులు సన్మానించారు. వారు మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థినులు కోసిగిలో జరిగిన ఆదోని జోనల్ స్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటి మూడవ స్థానం దక్కించుకున్నారని తెలిపారు. ఈ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో కూడా రాణించాలన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

ఆదోని రూరల్: గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, అల్లర్లకు గొడవలకు పోరాదని తాలూకా సీఐ మహేశ్వరరెడ్డి, ఇస్వీ ఎస్ఐ విజయలక్ష్మి సూచించారు. ఈ మేరకు మదిరె గ్రామంలో శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో 'పల్లె నిద్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో మాట్లాడుతూ.. చట్టాలు, పోలీసు సేవల గురించి ప్రజలు తెలుసుకోవాలన్నారు. సమస్యలుంటే పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. చిన్న చిన్న విషయాలకే గొడవలకు పోయి పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితాలను నాశనం చేసుకోరాదని సూచించారు. రోడ్లపై వాహనాల్లో వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామస్తులు, ఇస్వీ పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తాలూకా సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్ఐ విజయలక్ష్మి

అమృత్ సరోవర్‌తో ప్రయోజనం

వెల్దుర్తి: అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువులలో పూడికతీత చేపట్టడం వల్ల భవిష్యత్తు తరాలకు నీటి సంరక్షణతోపాటు, భూగర్భ జలాల పెంపు, జలచరాలు, జంతువులు, పశువులకు నీటి సౌకర్యం, చెరువుల అభివృద్ధి, పునరుద్ధరణ, రైతులకు సాగు నీటి వసతి, కూలీలకు ఉపాధి, మట్టి రవాణా ద్వారా వాహనదారులకు ఆదాయం, పొలాల్లో పూడిక మట్టి చల్లడం వల్ల భూసార పెంపు తదితర మేలు జరుగుతుందని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామ తోట చెరువులో రూ.10 లక్షల అంచనాతో చేపడుతున్న డక్‌అవుట్ పాండ్ ద్వారా పూడికతీత పనులను పరిశీలించారు. ప్రస్తుతం రూ.3 లక్షల వరకు పనులు జరిగినట్లు తెలిపారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కూలీల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. ప్రాజెక్టు పనుల్లో భాగంగా చెరువు కరకట్టపై పిచ్చి మొక్కలు తొలగించాలని ఏపీఓ రాజునాయక్‌ను ఆదేశించారు. అనంతరం రైతు నాగమ్మ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఈ ఏడాది మూడెకరాల్లో చేపట్టిన మామిడి సాగును పరిశీలించారు. టీఏలు శేఖర్, మాణిక్యం, ఎఫ్ఏ చిన్నరంగడు ఉన్నారు.

నీటి కోసం ఘర్షణ

ఎమ్మిగనూరురూరల్: రాళ్లదొడ్డి గ్రామంలో శుక్రవారం సాయంత్రం కుళాయి నీటి కోసం జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన చాంద్‌బాషా తండ్రి అబ్దుల్లా ఇంటి నిర్మాణం చేపట్టాడు. శుక్రవారం పైప్‌ద్వారా కుళాయి నీటిని గోడలకు తడుపుతుండగా పక్కింటికి చెందిన హుసేన్‌వలి, బడేసాబ్ తమ ఇళ్లకు నీరు రావడం లేదని ప్రశ్నించడంతో మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దాడిలో ముక్తుస్‌వలి, మాభి, చాంద్‌బాషాకు గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హుసేన్‌వలి, బడేసాబ్, మాభిలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ చంద్ర తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ సమీపంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలించారు.కాలనీలో రూరల్‌కు సంబంధించి 160 గృహాలు,పట్టణానికి చెందిన 1,158 పక్కా గృహ నిర్మాణాల దశలపై హౌసింగ్ డీఈ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గృహాలన్నీ బేస్ లెవెల్‌లో నిర్మాణాలు పూర్తి కావడంపై సంతృప్తి వ్యక్యం చేశారు.నిర్మాణాలు సత్వరం పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని అధి కారులకు సూచించారు. కాలనీలో విద్యుత్, నీటి సౌకర్యంపై ఆరాతీశారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు వెంటనే ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. తహసీల్దార్ జయన్న, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఎమ్మిగనూరు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

లారీ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో లోకల్ లారీ అసోసియేషన్‌కు సొంత భవనం లేక డ్రైవర్లు, క్లీనర్లు, యజమానులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై ఎన్నికల ముందు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అసోసియేషన్‌కు స్థలం కేటాయించి భవనం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి లారీ అసోసియేషన్‌కు స్థలం, కార్యాలయం ఏర్పాటు చేశారు. దీంతో కొత్తగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని శుక్రవారం యువ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. లారీ ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్ల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు

పెట్రోల్ బంకుల తనిఖీ

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లను తహసీల్దార్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలిస్తామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు ఇన్‌ఛార్జ్ ఆర్ఐ ఆనంద్, వీఆర్వో భీమన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు

- ఎల్లెల్సీ కింద జోరుగా పంటల సాగు
- రైతన్నల్లో ఉత్సాహం



ఎల్లెల్సీ కింద సాగుచేసిన వేరుశనగ పంట



సాగునీటి విడుదలతో నిండుగా ప్రవహిస్తున్న ఎల్లెల్సీ కాల్వ

కోసిగి: ఆశల రబీలో సాగు చేసుకున్న పంట పొలాలకు ఎల్లెల్సీ నుంచి పుష్కలంగా సాగునీరు అందుతోంది. కోసిగి మండలంలో ఎల్లెల్సీ ఆయకట్టు కింద రబీ సీజన్‌లో 2,600 ఎకరాల ఆయకట్టు భూములు సాగులోకి వచ్చాయి. మండలంలోని దుద్ది, కొల్మాన్‌పేట, కోసిగి, దువరబెట్ట, సజ్జలగుడ్డం, జంపాపురం, ఐరన్‌గల్లు, డి.బెళగల్ గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలు ఉన్నాయి. ఆయకట్టు కింద పత్తి, వేరుశనగ, మిరప, ఉల్లి పంటలు సాగుచేసుకున్నారు. గతేడాది ఖరీఫ్‌లో కర్ణాటక ప్రాంతంలో అధిక వర్షాలు కురిసి తుంగభద్ర హోస్పేట్ డ్యాం పూర్తిగా నిండింది. తుంగభద్ర నది నుంచి దుద్ది మూగలదొడ్డి, బసలదొడ్డి ఎత్తిపోతల పథకాలను నీటితో స్టోరేజ్ చేశారు. ఖరీఫ్, రబీ ప్రారంభం వరకు ఎత్తిపోతల పథకాల ద్వారా పంటలకు సాగు నీటిని అందించారు. ప్రస్తుతం ఎల్లెల్సీ నుంచి మండలంలోని కరణి, తిప్పలదొడ్డి, వందగల్లు, కొల్మాన్ పేట, దుద్ది, కోసిగి, దేవరబెట్ట, సజ్జలగుడ్డం, జంపాపురం, ఐరన్‌గల్లు గ్రామాల వరకు కెనాల్ నిండుగా ప్రవహిస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఎల్లెల్సీ ఇరిగేషన్ అధికారులతో చర్చించి రబీ సీజన్‌లో కాల్వల కింద సాగుచేసుకున్న పంట పొలాలకు సాగునీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పంట కాలం ముగిసే వరకు మార్చి ఆఖరు వరకు సాగునీరు కొరత రాకుండా చూడాలన్నారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు పైప్రాంత ఇరిగేషన్ అధికారులతో చర్చించి సాగునీటి విడుదలకు కృషి చేశారు. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగేళ్లుగా రైతుల్లో ఆనందం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సమృద్ధిగా వర్షాలు కురవడంతో నాలుగేళ్లుగా రెండేసి పంటలు పండిస్తున్న రైతుల మోమోల్లో ఆనందం విల్లివిరుస్తోంది. గత పాతికేళ్లుగా ఎల్లెల్సీ కాల్వ నీరు రాకుండా కర్ణాటక పైప్రాంతాల రైతులు సాగునీటిని దోచేసేవారు. పంట పొలాలన్నీ బీడు భూములుగా ఉండేవి. ఖరీఫ్‌లో మాత్రం పంటలు సాగుచేసుకుని రబీలో బీడు భూములుగా వదిలేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా నాలుగేళ్లుగా మార్చి ఆఖరు వరకు ఎల్లెల్సీ నుంచి నీటిని అందిస్తున్నారు. దీంతో రైతులు రెండు పంటలు పండించుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎల్లెల్సీ అధికారులతో చర్చించి పంట పొలాలకు సాగునీటిని విడుదల చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేకంగా రుణపడి ఉంటాం. పంటలు ఎండిపోకుండా రైతుల పక్షాన నిలబడి పుష్కలంగా సాగునీరు అందించేందుకు కృషి చేశారు. ఆయకట్టు కింద 5 ఎకరాలు వేరుశనగ, ఉల్లి సాగుచేసుకున్నాను. పంటలు ఎండి పోకుండా సాగునీటిని విడుదలకు ప్రత్యేక కృషి మరువలేం.

– నాడుగేని వీరేష్, రైతు, కోసిగి

వేరుశనగ పంట సాగు చేశా



నాకు దేవరబెట్ట పొలాల్లో 4 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. వేరుశనగ, మిరప పంటలను సాగు చేశాను. గతంలో రబీలో బీడు భూములుగా వదిలేసే వాళ్లం. నాలుగేళ్లుగా రెండు సీజన్లలో పంటలు సాగు చేసుకుంటున్నాం. ఈ ఏడాది కూడా కాల్వ నుంచి సాగునీరు నిండుగా ప్రవహిస్తోంది. మంచి పంటలు పండించుకుంటూ కుటుంబం అంతా సంతోషంగా ఉన్నాం.

– మారయ్య, రైతు

మార్చి ఆఖరు వరకు సాగునీరు అందిస్తాం

కోసిగి మండలంలోని చివరి ఆయకట్టు భూములన్నింటికీ మార్చి ఆఖరి వరకు సాగునీటిని అందిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎల్లెల్సీ పైప్రాంత అధికారులతో చర్చించాం. విడుతల వారీగా రైతుల అవసరాల మేరకు దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తాం.

– రాజేష్, ఇరిగేషన్ ఏఈ